డిటెక్టివ్ కథ

# నరహరిని ఎవరు చంపారు?

సారథి


ఉపన్యాసాలిచ్చే వాళ్లు శ్రోతల ఓపికను పరీక్షస్తారు. ఆడియెన్సులో కూర్చున్న వాళ్లు కూడా మానవ మాత్రులే గదా, తన మీది గౌరవంతో, నాలుగు మాటలు వినిపోదామని వచ్చిన పాపానికి యిలా శిక్షించటం తగునా అని ఏ వక్తయినా కనికరం చూపిస్తాడా?

ఫిలాసఫీ క్లబ్బులో ప్రొఫెసర్‌గారు తన వుపోద్ఘాతం ప్రారంభించారు. తత్వశాస్త్రమంటే ఏమిటి? దాని పుట్టు పూర్వోత్తరాలేమిటి? నిర్వచనమేమిటి? మొదట శ్రోతల్లో వుత్సుకత రేకెత్తించాలి. తరువాత దాన్ని సంతృప్తిపరచాలి. ఆ తర్వాత ప్రాక్పశ్చిమ తాత్వికధోరణుల గురించి వివరించాలి. 'ఎందుకు?' అనే ప్రశ్న తాత్విక అన్వేషణకు తొలిమెట్టు. ఎవరేం చెప్పినా, ఎక్కడ ఏం చదివినా వెంటనే ఔనని తలూపగూడదు. ఆ స్టేట్‌మెంట్ల, ప్రతిపాదనల వెనక వున్న హేతుబద్ధత ఏమిటి? అని ప్రశ్నించాలి. మన ప్రశ్నలను బట్టే జవాబులూ వుంటాయి. అంటే, తత్వశాస్త్రాధ్యయనంలో భాషకు అంతటి ప్రాధాన్యమున్నదన్నమాట. ప్రతి పదం, అది వాడిన సందర్భం, ఆ మాటలు మాట్లాడిన వ్యక్తీ, విన్న వ్యక్తి – అందరూ ముఖ్యమే! భాష లేక ఆలోచన లేదు. సందేహం, ప్రశ్న కూడా ఆలోచనే గదా. అందువల్ల నేను మాట్లాడే ప్రతి మాటా మీరు శ్రద్ధగా వింటారనే ఆశిస్తున్నాను'' అంటూ హాల్లో శ్రోతల వైపు చూశారు ప్రొఫెసర్ గారు. కొందరు ఆవలిస్తున్నారు. కొందరు జోగుతున్నారు. కొందరు పాప్‌కార్న్ తింటున్నారు. మరి కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. వెరసి ఎవరూ తనను వినటం లేదు. మనిషికీ ప్రకృతికి ఈ విశ్వాంతరాళినికి వున్న సంబంధం గురించి మాట్లాడాలి. 'అసలు, ప్రశ్నలు అడగటం ఎలా?' అన్నది వివరించటానికే ఓ గంట పడుతుంది. కాని శాస్త్ర విషయాలనైనా, సంక్లిష్ట విజ్ఞాన రహస్యాలనయినా, కథలుగా చెబితే అందరూ చెవులు రిక్కించుకుని వింటారు. పంచతంత్రం, ఈసపు కథలు అనేక యితర జానపద కథల ప్రయోజనం అదే!

''ఓకే! వుపన్యాసం వద్దు. మీకో కథ చెబుతాను. జాగ్రత్తగా వింటారా?'' అంటూ మైక్ సవరించుకున్నాడు ప్రొఫెసర్ గారు.

''ప్రొఫెసర్ గారికి జ్ఞానోదయమైంది'' అన్నాడో కొంటె కోణంగి.

''నరహరి నెవరు చంపారు?''





అర్థం కానట్టుగా చూశారు. శ్రోతలు.

''ఆలోచించకండి. ఇంకా కథ ప్రారంభం కాలేదు. నరహరి మరణించిన పరిస్థితుల్లో మిస్టరీ ఏమీ లేదు. ఆ కేసును పోలీసులు చాలా త్వరగా సాల్వ్ చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చెప్పిన కథ మీకు తుచ తప్పకుండా చెబుతాను. ప్రతి పదమూ జాగ్రత్తగా వినాలి. జాగ్రత్తగా ఆలోచించాలి అని ముందే చెప్పాను. నా సలహా పాటిస్తే మీరు కూడా, కథ సగం వినే సరికే, 'క్లూ' దొరికిందని చెబుతారు. ఓకే, ఇక కథ'' అంటూ గ్లాసులోంచి ఒక గుక్కెడు నీళ్లు తాగాడు ప్రొఫెసర్ గారు.

''కథలో వస్తువు మాత్రమే కాదు. కథ చెప్పే పద్ధతి కూడా ముఖ్యమే! ఇక, నో మోర్ వార్నింగ్స్. వినండి. మరణించే నాటికి నరహరి వయస్సు నలభై ఐదు. అహంకారి. అందరితో కాస్త దురుసుగానే ప్రవర్తించే వాడు. మనిషి నలుపు. నూనెతో మెరిసే నల్లటి జుత్తు. చిన్ని పొట్ట. కాలేజీ పిల్లాడిలా కనిపించాలని ఫాషనబుల్ దుస్తులు వేసుకోవటంతో ఆ వేషం కాస్త ఎబ్బెట్టుగా కూడా వుండేది. రెండు నిమిషాలు మాట్లాడితే చాలు, అతడి మీద అసహ్యమేస్తుంది. అలాంటివాడు, కొన్నేళ్ల క్రితం, బాగా డబ్బున్న ఓ అమ్మాయికి లైనేసి ఫైనల్‌గా పెళ్లి చేసుకున్నాడు. ఆమె అతని కన్నా పన్నెండేళ్ల చిన్నది. అందంగా వుంటుంది. ఆ అమ్మాయి ఇతడి వలలో ఎలా పడిందనేది యిప్పటికే ఓ మిష్టరీగానే మిగిలింది. ప్రతి మాట జాగ్రత్తగా వినమని చెప్పానుగా. ప్లీజ్ నోట్. ఆమెను బెదిరించో, బ్లాక్ మెయిల్ చేసో ఎలా చేసుకున్నాడో గాని, మూడు సంవత్సరాల తిరక్కుండానే ఆమె ఇతడితో కలిసుండలేనని తెగేసి చెప్పింది. ఆ తర్వాత వాళ్ల కారు డ్రైవర్‌తో లేచిపోయింది. ఒక వేళ ఆమె చలం మైదానం చదివిందనే



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## జేబులో ఏముంది?

"నేర పరిశోధనంటే వ్యక్తుల ప్రవర్తనను నిశితంగా పరిశీలించటమే! కొందరికి ఆ నేర్పు సహజంగా వస్తుంది కాబోలు! ఓ కేసు ఎలా సాల్వ్ చేశానో చెబుతాను వినండి' అంటూ కాఫీ సిప్ చేశాడు డిటెక్టివ్.

"అంతకన్నా కావలసిందేమిటి? మీ అనుభవాలే మాకు క్రిమినాలజీ పాఠాలు" అన్నారు ట్రెయినీ డిటెక్టివ్‌లు.

"ఒకనాడు, పార్క్‌లో బెంచీమీద, రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో మృతదేహం కనిపించింది. ఎడమ కణత మీద బులెట్ గాయముంది. కుడిచేయి ఫ్రాక్చర్ అయిందేమో! వేళ్ల నుండి మోచేతి దాకా ప్లాస్టర్ వేసుంది. ఎడమచేతిలో 0.32 కాలిబర్ పిస్టల్ వుంది. పంచనామా తర్వాత, అప్పటికి గంట క్రితం, అంటే ఏడు గంటలప్పుడు మరణించి వుంటాడని నిర్ణయించారు పోలీసులు. వాళ్ల ప్రకారం అది ఆత్మహత్య. ఎఫ్ఐఆర్‌లో అలాగే రికార్డు చేశారు. కాని, మృతుడి జేబులో దొరికిన వస్తువులను బట్టి అది హత్య అని నిరూపించాను నేను. (తరువాత హంతకుడు కూడా దొరికాడు. అది వేరే విషయం). అతణ్ణి మరెక్కడో హత్యచేసి, దుస్తులు మార్చి, బెంచీ మీదికి చేర్చారని నా థియరీ. ఇదంతా నేనెలా వూహించానంటారా? పాంట్ కుడిజేబులో కొన్ని రూపాయి నోట్లూ, చిల్లర నాణాలు వున్నాయి. ఎడమ పాకెట్‌లో సిగరెట్ లైటర్, జేబురుమాలు, ఎడమ హిప్‌పాకెట్‌లో మనీ పర్సున్నాయి. అర్థమైందా? హంతకుడు చేసిన పొరబాటేమిటో?

ఏమిటో పొరబాటు?

---

సమాధానం: కుడిచేతికి ప్లాస్టర్ వేసుకున్న వ్యక్తి, కుడిజేబులో తరచుగా అవసరమయ్యే కరెన్సీ నోట్లూ, చిల్లర నాణాలు ఎందుకు వేసుకుంటాడు. తియ్యటం ఇబ్బంది కదా. అవి ఎడమ జేబులో వుంటే అతడు సులభంగా తీసుకోగలడు. అంటే, హంతకులు, దుస్తులు మార్చినప్పుడు జేబుల్లో అలా పెట్టారన్నమాట!

---

అనుకున్నా, డ్రైవర్ చదివే అవకాశం లేదు. ఎందుకంటే అతనికి చదువు రాదు. ఆమె ప్రేమ కోసం యింట్లోంచి వెళ్లిపోయిందనుకోవటానికి లేదు. మొత్తం మీద ఆమె డ్రైవర్‌తో కూడా ఎక్కువ కాలం ఉండలేదు. ఆస్తి అతని పేరు మీద వున్నందు, వల్లనో విడాకులు తీసుకుంటే సంఘంలో గౌరవం తగ్గిపోతుందనో, ఆమె అతనికి విడాకులు కూడా యివ్వలేదు. కలిసి బతకలేరు. చట్టబద్ధంగా వేరుపడరు. మరెలా? కొన్నాళ్లు దూరంగా వున్నారు. ఆ తర్వాత తలవంచుకుని యింటికొచ్చింది.

ఆమె అతనికన్నా కాస్త పొడుగ్గా వుంటుంది. లావెక్కిందేమో! పెళ్లి తర్వాత ఆమె ఫొటో చూస్తే అతడి కన్నా చాలా పెద్దదానిలా కన్పిస్తుంది. ఒంటి ఛాయ కూడా అతడిలాగే నలుపు. మరోసారి చెబుతున్నాను. డబ్బు కోసం అతడామెను చేసుకున్నాడనే అనుకున్నప్పటికీ, ఆమె ఎందుకంగీకరించిందో మాత్రం అంతుపట్టదు. ఎందుకంటే, ఆమెకు డబ్బు మీదకూడా ఆసక్తి లేదు. పాపం, ఏ మాటకామాటే చెప్పుకోవాలి. డ్రైవర్ కూడా ఆమె నుండి డబ్బులాగటానికి ప్రయత్నించలేదు. అతడూ వచ్చి నరహరి వద్ద ఉద్యోగంలో చేరాడు.

నరహరికి, నగర పొలిమేరల్లో ఒక చిన్న బొమ్మల ఫాక్టరీ వుంది – విమానాలు, కార్లు, షిప్పులు, మోటారు సైకిళ్లు వగైరా తయారు చేస్తారు. ధరలు కూడా కాస్త ఎక్కువే! పోటీ వల్ల కావచ్చు లేదా వాటి నాణ్యత బాగుందోగాని డిమాండ్ పెద్దగా లేదు. కొన్నేళ్ల క్రితం, మహేశ్ అగర్వాల్ అనబడే మరో పారిశ్రామికవేత్త కూడా ఒక బొమ్మల ఫ్యాక్టరీ పెట్టి మంచి లాభాలు ఆర్జించాడు. ఇంకేముంది, అసలే అంతంత మాత్రంగా వున్న నరహరి ఫాక్టరీలో కార్మికులకు జీతాలు కూడా యివ్వలేని పరిస్థితి ఏర్పడింది. తన మార్కెట్ షేర్ నిలబెట్టుకోవటం కోసం నరహరి బొమ్మల ధరలు తగ్గించాడు. అటు అగర్వాల్ కూడా తగ్గించాడు. ఈ ప్రైస్ వార్‌లో యిద్దరూ నష్టపోయారు. చివరికి, ఒక ఒప్పందం కుదుర్చుకుందామనకునే సరికే దివాలా తీసే దశకు చేరుకున్నారు.

కలిసి వ్యాపార విషయాలు చర్చించుకుందామనుకున్నారు. ఎక్కడ? ఏ హోటల్లోనో, మరెవరైనా వుమ్మడి మిత్రుడి ఇంట్లోనో కూర్చోవచ్చుగా. లేదు. నరహరి యింట్లో సమావేశం జరిగింది. పొద్దుపోయిందని అగర్వాల్ ఆ రాత్రికక్కడే పడుకున్నాడు. అతడికి పొండు రోగమున్నది. మనిషి సుద్దముక్కలాగుంటాడు. జుత్తు కూడా వెండి తీగల్లా తెల్లగా మెరుస్తుంటుంది. పొండు రోగం వున్నందుకు అతని మీద సానుభూతి కలిగితే కలగొచ్చు గాని, మనిషి మహా మొండి. వ్యాపార విషయాల్లో పట్టువిడుపులు లేవు. ఎప్పుడూ తన మాటే నెగ్గాలంటాడు. అగర్వాల్ వల్లనే తన భర్తకు వ్యాపారంలో నష్టం వచ్చిందని నరహరి భార్యకు తెలుసు. కాని అతడి మీద కోపం లేదు. లాభాల వేటలో అందరూ అలాగే వుంటారు. పైగా తన భర్త ఎంతటి సుగుణాభిరాముడో ఆమె అనుభవ పూర్వకంగా గ్రహించింది. ఇటీవల, యిప్పుడో అప్పుడో డైవర్స్ యిస్తానంటూ రోజూ బెదిరిస్తున్నాడు. ఇక డ్రైవర్ సంగతి చెప్పక్కర్లేదు. అతడికీ విషయాలే అర్థం కావు. కాని యజమాని మీద కోపం ఉంది. ఇంత జరిగాక కూడా నరహరి భార్యను యింట్లోనే వుండనిస్తున్నాడు. డ్రైవర్‌ను ఉద్యోగం నుంచి తీసెయ్యలేదు. అతడేమీ ప్లాను వేస్తున్నాడో ఎవరికీ అంతుబట్టలేదు. ఇది 'పిల్లి – ఎలుక' కథ లాగుందా? ఎవరు పిల్లి, ఎవరు ఎలుకో మీరే తేల్చుకోండి. డైవోర్స్ వల్ల వచ్చే అప్రదిష్ట ఆమెకిష్టం లేదు గనుక, ఇస్తానని భయపెట్టటం వల్ల మాత్రమే ఆమెను లొంగదీసుకోవచ్చు. అది అతని శాడిజం. ఈ విషయం అనేక సార్లు డ్రైవర్‌కు చెప్పుకుని ఏడ్చిందామె. లోపల అతనూ రగిలి పోతున్నాడు. కాని ఏం చెయ్యగలడు? అకస్మాత్తుగా, ఒక రాత్రి ఒక మరణం సంభవించక పోయి వుంటే ఆ కుటుంబంలో మరే పరిణామాలు సంభవించేవో తెలియదు.

సరే! ఆ సాయంత్రం మహేశ్ అగర్వాల్, తన వ్యాపార ప్రత్యర్థి నరహరి యింటికొచ్చాడు. ఇల్లాలుగా నరహరి భార్య, అతిధి మర్యాదలు చేసింది. రాత్రంతా వ్యాపారస్తులిద్దరూ చర్చలు కొనసాగించారు. నిజానికి వాళ్ల మధ్య స్నేహం లేదు. గుడ్ విల్ లేదు. ఒకడు మరొకడికి ఎలా టోకరా వెయ్యాలా అనే ఆలోచనే! గంటగంటకూ యిద్దరి మధ్యా వైషమ్యం పెరిగింది. ద్విగుణీకృతమైంది. ఉబికి వస్తున్న కోపం, ద్వేషాన్ని అణచుకోవటానికి యిద్దరూ విఫలయత్నాలు చేశారు. అర్థరాత్రి దాటిన తర్వాత, యింటికి పోలేని అగర్వాల్ తనకు కేటాయించిన గదిలో నిద్రకుపక్రమించాడు.

మరునాడుదయం, అందరికన్నా ముందర వంట మనిషి చూసిందా మృతదేహాన్ని. మిమ్మల్ని తికమక పెట్టటానికి నేనీ మిస్టరీ సృష్టిస్తున్నాను. అసలు హత్య చేసింది వంట మనిషే అని మీరు నిర్ధారణకు రావద్దండీ. ఆమెకీ హత్యతో ఏమీ సంబంధం లేదు.

కిటికీలో నుండి మృతదేహాన్ని చూసిన వంట మనిషి "అయ్యో, అయ్యగారు మూర్ఛపోయాడుకి కాబోలు" అనుకుందట (అని పోలీసు ఆమె యిచ్చిన స్టేట్‌మెంట్). కాని మృతదేహం జుత్తులో మెరిసిన ఎర్రటి నెత్తురు చూసి అది హత్యే అనీ అనుకుంది. వెంటనే అందర్నీ లేపింది. ఈ విషయం తెలుసుకున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కూడా వచ్చి వీలైనన్ని క్లూలు, సాక్ష్యాధారాలు సేకరించాడు. కార్పెట్ మీద పడి వున్న మృతదేహం చుట్టూ రక్తం గడ్డ కట్టి వుంది. వెనక నుండి ఎవరో పదునైన ఆయుధంతో పొడిచారు. వేలి ముద్రల సంగతి వెంటనే తేలలేదు గాని, పక్కనే ఒక కత్తి కూడా పడి వుంది.

నేరాన్ని నిరూపించటానికి సరిపడిన ఆధారాలన్నీ వెంటనే పోలీసులకు దొరికాయని చెప్పలేం. కాని హత్య చేసే వుద్దేశంతో కాకుండా, కేవలం దొంగతనం కోసమే దుండగులు లేదా దుండ

గుడు ప్రవేశించాడని పోలీసులను తప్పుదారి పట్టించటానికి ఒక ప్రయత్నం జరిగింది. ఒక కిటికీకున్న గ్లాస్ పగల గొట్టారు. బైట నుండి దూకి వచ్చినట్టుగా గదిలోని వస్తువుల్ని చిందరవందరగా విసిరేశారు. ఒక అల్మైరా తలుపు బలవంతంగా తెరిచారు. అయితే, ఇంటిముందర తడిగా వున్న లాన్‌లో ఎవరి పాదముద్రలూ కనిపించలేదు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం – నరహరి, కొన్నన్నాళ్ల క్రితం ఎంతో కష్టపడి, ఎంతో ధర చెల్లించికొన్న ఒక చైనీస్ వేజ్ కనిపించలేదు. వచ్చిన వాడు హత్యచేసి అది తీసుకుని పారిపోయంటాడా? ఆ ప్రాచీన కళాఖండం విలువ తెలిసిన వాడే దాన్ని దొంగిలిస్తాడు. మామూలు దొంగా హంతకుడు దాన్నెందుకు తీసుకుపోతాడు? అంటే 'దొంగతనం' నిజం కాదు. ఇంట్లో వున్న ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు హత్యచేసుండాలి. హత్య చెయ్యవలసిన అవసరం ఎవరికుంది? మొత్తం మీద, ఇరవై నాలుగ్గంటలు గడవక ముందే డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ హంతకుణ్ణి అరెస్టు చేశాడు'' అంటూ కథ ముగించాడు ప్రొఫెసర్.

శ్రోతలకేమీ అర్థం కాలేదు.

''అదేమిటి? మధ్యలో ఆపేశారు?''

''కథ ముగిసింది! ఆ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చెప్పినవన్నీ మీకు పూసగుచ్చినట్టు చెప్పాను. ఒక్క మాట కూడా వదిలి పెట్టలేదు. ఇప్పుడు నేను నా మొదటి ప్రశ్న మరోసారి రిపీట్ చేస్తాను.

''నరహరిని ఎవరు చంపారు?''

''మీరు మొత్తం చెప్పలేదు. ఏదో వదిలేశారు''

''నమ్మండి మిత్రమా, ఒక్క మాటంటే ఒక్క మాట, యింకా మాట్లాడితే – ఫుల్‌స్టాప్ కామా కూడా వదిలి పెట్టలేదు. మీకు మరొక్క క్లూ యివ్వనా? అతడు తొమ్మిదింటికి మరణించాడు''.

అందరూ తలలు పట్టుకున్నారు. జుట్టు పీక్కున్నారు. గోళ్లు కొరుక్కున్నారు. అంతుపట్టలేదు.

''మాకు తెలియదు. మీరు చెప్పండి. నరహరిని ఎవరు చంపారు?''

ప్రొఫెసర్ గారు చిరునవ్వుతో ''సింపుల్'' అంటూ మిస్టరీ సాల్వ్ చేశాడు.

''జైల్లో తలారి అతణ్ణి వురితీశాడు. మహేశ్ అగర్వాల్‌ను హత్య చేసింది అతడేనని కోర్టువారు నిర్ధారించారు''.

శ్రోతల్లో రణగొణ ధ్వనులు పెరిగాయి.

''నాన్సెన్స్'' ''అన్‌ఫెయిర్'' ''ట్రిక్స్ ప్లే చేస్తున్నారు'.

''అబద్ధం – 'అన్‌ఫెయిర్'గా ఆరోపణలు చేస్తున్నది మీరు. కథలో ఈ ఒక ట్రిక్ వుందంటే అంగీకరిస్తాను. కాని ప్రారంభంలో మిమ్మల్ని ఎన్నిసార్లు హెచ్చరించాను? నా వుద్దేశం మీకు కథ చెప్పటం కాదు. తాత్విక చర్చల్లో భాష ప్రధానం. ప్రతి పదాన్నీ జాగ్రత్తగా విని అర్థం చేసుకోవాలని చెప్పానా లేదా? నా మొదటి ప్రశ్న ఏమిటి – ''నరహరిని ఎవరు చంపారు'' అని. కథలోని విషయం మాత్రమే కాదు, చెప్పే పద్ధతి మీద కూడా దృష్టి పెట్టాలన్నానా లేదా?''

''ఇవన్నీ విస్మరించినా, మీకు 'క్లూ'లిచ్చానా లేదా? గదిలో అంటే నీడలో – పడి వున్న మృతదేహాన్ని వంట మనిషి వుదయాన్నే చూసింది. ఆమెకు మృతునికి తలలో నెత్తురు కూడా కనిపించింది. అదీ మెరుస్తున్నదనీ చెప్పాను. నరహరిని మొదట్లో ఎలా వర్ణించాను? నల్లగా వుంటాడు. జుత్తు కూడా నల్లగా వుంటుంది. నలుపులో కలిసిపోయిన నెత్తురు కొంత దూరం నుండి ఆమెకు కనిపిస్తుందా? అంటే అది నరహరి శరీరం కావటానికి వీల్లేదన్న మాట! మహేశ్ అగర్వాల్ ఎలా వుంటాడు? పాండు రోగి. జుత్తు కూడా వెండి తీగల్లా తెల్లగా వుంటుంది. ఆ నేపథ్యంలో నెత్తురు సులభంగా కనిపిస్తుందా లేదా? అగర్వాల్‌ను చంపే 'మోటివ్' ఎవరికుంది? నరహరికి మాత్రమే! నరహరి భార్యకూ, డ్రైవర్‌కు ఆగంతకునిలో ఆసక్తి లేదు. అన్నింటికన్నా ముఖ్యం – నేను 'నరహరిని ఎవరు చంపారు' అనడిగానే తప్ప ''ఎవరు హత్య చేశారు?'' అని అడగలేదు. ఇక మనిషికీ, ప్రకృతికి వున్న సంబంధాన్ని గురించి మనం చర్చించదలచుకుంటే...'' అంటూ కొనసాగించాడు ప్రొఫెసర్.

''హా! దుర్విధీ' అంటూ సీట్లలో వెనక్కువాలి కళ్లు మూసుకున్నారు శ్రోతలు.

*

